# అడల్ట్స్ ఓన్లీ కథ




# ఈ సూర్యుడు పనికిరాడు

గోధూళి వేళని కాని, పక్షులు గూళ్ళకి చేరే సమయమని కాని చెప్పడానికి వీలు లేదు. ఎందుకంటే ఆ నగర మధ్యంలో గోశాలలు లేవు. ప్రాంగణాలున్నా పాడి పెంచే మనసులున్న మనుషులు లేరు. కుండీలలో పెరిగే మొక్కలు తప్ప వృక్షాలు లేవు.

అందుచేత, నగరం వెలిగ్రక్కుతున్న పొగల వెనుక పశ్చిమాన అస్తమిస్తున్న సూర్యుడు, మసిబారిన లాంతరులో వెలుగుతున్న వత్తిలా కనబడ్తున్నాడని చెప్పడం తప్ప మరో గత్యంతరం లేదు. ఇళ్లకి చేరే జనసందోహంలోంచి ఈదుకొంటూ, ధూమపూరితమైన గాలిలోంచి ప్రాణవాయువుని పీల్చే ప్రయత్నం చేస్తూ శివానందం వసంతవిహార్ గగన గృహ సముదాయాన్ని చేరుకొన్నాడు.

**ఎలక్ట్రాన్**



అది ఎనిమిదంతస్తుల భవనం. వాహనాలు నిలిపే స్థలంలో ఓ పక్కగా కట్టిన చిన్న కార్యాలయపు గదిలో ప్రవేశించాడు. బల్ల వెనుక కూర్చున్న నడివయసు వ్యక్తి శివానందాన్ని చూస్తూ కూర్చోమని మర్యాద పూర్వకంగా సంజ్ఞ చేశాడు.

''నా పేరు శివానందం. 'అంతర్వీక్షణాలలో ఎలా పాల్గొనాలి' అనే విషయంపై మీ సంస్థ శిక్షణనిస్తోందని నా స్నేహితులు చెప్పారు. మూడు తరగతులకి పదిహేను వందలు తీసుకొంటారని తెలిసింది. శిక్షణా తరగతులే సమయంలో నిర్వహించబడ్తాయి?'' శివానందం తన్ను తాను పరిచయం చేసుకొని, సంగతి చెప్పి చివరగా ప్రశ్నించాడు.

''శివానందంగారు మీరేనా? రుసుముని మీ స్నేహితులు ముందే చెల్లించేశారు. ఇక మా తరగతులకు నిర్ణీతమైన సమయమంటూ లేదు. కావాలంటే ఈ క్షణంలో మీరు హాజరు కావొచ్చు, ఏమంటారు?'' ఆ నడివయసు వ్యక్తి చిన్నగా నవ్వుతూ అన్నాడు.

శివానందం సరేనన్నట్లుగా తలూపడంతో, ఆ వ్యక్తి ఓ ఆకుపచ్చటి చిన్న కార్డుమీద శివా

నందం పేరు రాసి యిస్తూ అన్నాడు.

''మీరు లిఫ్టులో నేరుగా ఎనిమిదో అంతస్తుకి పోయి, అయిదో నెంబరున్న అపార్ట్‌మెంటుకి వెళ్ళండి''

శివానందం ఎనిమిదో అంతస్తుకి పోయి, అయిదో నెంబరు తలుపు పక్కనున్న కాలింగ్ బెల్ నొక్కాడు. అరనిముషంలో తలుపు తెరుచుకుంది. లేత నీలిరంగు యూనిఫారం చీరలో ఉన్న ఓ స్త్రీ శివానందాన్ని లోపలికి ఆహ్వానించి, సోఫాలో కూర్చోబెట్టి, ఓ గ్లాసులో చల్లటి నీరు తెచ్చి, సోఫాముందున్న గ్లాస్ టాప్ టేబుల్ మీద పెట్టి లోపలికి వెళ్ళింది.

శివానందం గ్లాసు తీసుకుని, ఓసారి వాసన చూసి, తర్వాత నెమ్మది నెమ్మదిగా నీళ్ళు ఒక్కొక్క గుక్కగా తాగుతూ గదిని పరిశీలించసాగాడు. ఎదురుగోడ నానుకొని అరడజను గాజు తలుపుల బీరువాల నిండా పుస్తకాలు. ఆయా బీరువాల తలుపులమీద సైన్సు, కామర్సు, హెల్త్, ఎన్విరాన్‌మెంట్, సైకాలజీ వగైరా లేబిళ్ళు అంటించబడి ఉన్నాయి. బీరువాలకి ముందుగా ఓ రివాల్వింగ్ ఛైర్. దానికి ముందుగా అపురూపంగా ఉన్న పెద్ద టేబుల్. బల్లకివతలగా ఒకటీ, యిరుపక్కలా చెరొకటీ-మొత్తం మూడు కుర్చీలు. ఏ.సి. మూలాన గదిలోని వాతావరణం చల్లగా ఉంది. చందన సుగంధం గదంతా లీలగా వ్యాపించి ఆహ్లాదంగా ఉంది.

''మీది చాలా నిదానమైన స్వభావం. ఆచితూచి కాని అడుగు వెయ్యరు'' కోమలమైన స్వరంలో వచ్చిన మాటల్ని విన్న శివానందం తల తిప్పి చూశాడు. పక్కగుమ్మంలోంచి ఓ అందమైన యువతి నడుచుకొంటూ వచ్చి రివాల్వింగ్ ఛైర్లో కూర్చుంది. చందనపు వాసల్ని అధిగమించి మరో రకమైన పరిమళం శివానందం ముక్కుపుటాల్ని తాకింది. ఆమె శివానందాన్ని చూస్తూ ''యిలా వచ్చి ఎదురు కుర్చీలో కూర్చోండి'' అని ఆహ్వానించింది.

శివానందం సోఫాలోంచి లేచి, నడిచి వెళ్ళి కుర్చీలో కూర్చున్నాడు ''నా పేరు శివానందం. మీరు..?'' శివానందం తనకి కింద యిచ్చిన కార్డుని బల్లమీద ఆమె ముందుగా పెడ్తూ అన్నాడు.

''ఇంటర్వ్యూలలో అధికారులడగకముందే అభ్యర్థులు తమ పేర్లు చెప్పడం లేదా అభ్యర్థులు అధికార్ల పేర్లనడగడం-సముచితం కాదు!'' ఆమె నవ్వుతూ అంది.

''లోపల అడుగు పెట్టే ముందే అభ్యర్థి తాలూకు వివరాలు బోర్డు మెంబర్లకి తెలుస్తాయి. అయినా అభ్యర్థికి మనస్థైర్యం కలిగించే నిమిత్తం ముందుగా పేరూ, యితర వివరాలూ అడగడం జరుగుతుంది. అయితే బోర్డు మెంబర్లెవరన్నదీ చాలా సందర్భాల్లో అభ్యర్థులకి తెలిసే అవకాశం లేదు. అభ్యర్థులకి తామెవరో తెలుపవలసిన సత్సంప్రదాయం అధికారులకీ ఉండాలి. మన పాలనా వ్యవస్థలో ఆ యిది లేదు. ఈ కారణంగా 'యింటర్వ్యూ' అనే పదానికి అంతర్వీక్షణం, పరస్పరవగాహన అనే భావార్థాలని పక్కకి నెట్టి ఏక పక్ష వీక్షణం అని కొత్త భాష్యం చెప్పుకోవాలి'' శివానందం కాస్త ఉద్రేకంగానే అన్నాడు.

''మీరు చెప్పేదాన్ని బట్టి చూస్తే మీరు చాలా యింటర్వ్యూలకి వెళ్ళారనిపిస్తోంది. మరిక్కడికి..?'' ఆమె అర్థాంతరంగా ఆగింది.

''ఎందుకు వచ్చానంటారు? గదిలో అడుగుపెడ్తోనే యిందాకా మీరు నా మనస్తత్వాన్ని గురించి ఏదో అన్నారు. నా గురించి అలాంటి అంచనానెలా వెయ్యగలిగారు?'' శివానందం ఆమె కళ్ళలోకి చూస్తూ అన్నాడు.

''గుమ్మం తెరవెనుక నుంచి మీరు మంచినీళ్ళు తాగిన విధానాన్ని గమనించిన నాకలా అన్పించింది!'' ఆమె సమాధానం చెప్పింది. వాస్తవానికామె శివానందం చర్యలని క్లోజ్డ్ సర్క్యూట్ టీవీలో చూసింది.

''మరి నా మాట తీరునిబట్టి నా యింటర్వ్యూలెందుకు కొండెక్కాయో మీరీపాటికి గ్రహించి ఉండాలే?'' శివానందం నిర్లిప్తతతో కూడిన ప్రశ్నని సంధించాడు.

''కుండ బద్దలుకొట్టినట్లు సమాధానాలు చెబ్తే కొండెక్కేవి ఒక్క యింటర్వ్యూలే కాదు, జీవితంలో అనేకమైన అంశాలు కూడా అవే గతిని పొందుతాయి!''

''యిందాకా నన్ను నిదానమైన వ్యక్తినన్నారు. ఇప్పుడేమో దుందుడుకు స్వభావం కలవాడినంటున్నారు. ఈ ద్వంద్వం మీ విశ్లేషణాలోపమా? లేక నిజంగానే నా ప్రవర్తనలో ద్వంద్వ వైఖరి ఉందంటారా?''

''ప్రశ్నలు నేనడగాల్సింది పోయి మీరే అడిగేస్తున్నారు! ద్వంద్వ ప్రవర్తన లేని మనుషులు చాలా అరుదుగా ఉంటారు. ఉక్కపోత

## మలయాళీ రియా!

అటు బాలీవుడ్, ఇటు టాలీవుడ్ సినిమాల్లో బిజీగా ఉండే తారలు మధ్యమధ్యలో ఇతర భాషా చిత్రాల్లో కూడా నటించాలనుకుంటారు. అలా కోరుకున్నా టైం కలిసిరాకపోతే ఆ ఆకాంక్ష నెరవేరదు. అందాలభామ రియాసేన్ కోరిక ఇప్పుడు నెరవేరినట్టుంది. ఇప్పుడీ భామ మలయాళంలో నటించే అవకాశాన్ని పొందింది. సంతోష్ శివన్ కొత్త చిత్రం 'అనాథభద్రం' చిత్రంలో ఆమె నటిస్తోంది. ఆ చిత్రం షూటింగ్ కోసం ఆమె కేరళ, ఇతర ప్రాంతాలకు వెళ్లనుంది.



వాతావరణంలోంచి లోపల అడుగుపెట్టి నిదానంగా దాహం తీర్చుకొన్న మీ వైఖరికీ, సంకోచం లేకుండా మీరు మాట్లాడే తీరుకీ సమన్వయం కుదుర్చుకోలేక నేనే సందిగ్ధావస్థలో పడిపోయాను.

## అన్నీ నేర్చుకుంటా

**సినిమాల్లోకి వచ్చాక చాలా బిజీగా అయిపోతారు తారలు. అయితే ఇప్పుడు కత్రినాకైఫ్ దినచర్య చాలా ఫాస్ట్‌గా మారిపోయింది. ఒక పక్క సినిమా కథలు వింటూ, హిందీ,తెలుగు భాషలు నేర్చుకుంటూ తెగ హైరానా పడిపోతోంది. 'చిత్రరంగంలో ఉండాలంటే భాష తెలిసుండాలి. దక్షిణాది కోసం తెలుగు, ఇక బాలీవుడ్ కోసం హిందీ నేర్చుకోవాలనుకున్నా. అలాగే ఇప్పుడు నేర్చుకుంటున్నా' అంటోంది కత్రినాకైఫ్. మొత్తానికి ఈమె లైఫ్‌స్టయిల్ బాగా మారిపోయిందన్నమాట.**

త్వర త్వరగా మీ మనస్తత్వాన్ని అంచనా వేద్దామని ప్రయత్నించి బోల్తాపడ్డాను. ఇంటర్వ్యూలలో మీరెందుకు పరాజయం పాలవుతున్నారో తెలుసుకోవడానికి నేనింకా చాలా వివరాలు పరిగణనలోకి తీసుకోవాలి. వాళ్ళడిగిన కొన్ని ప్రశ్నలూ, మీరిచ్చిన సమాధానాలూ చెప్పండి'' ఆమె చిరునవ్వులు చిందిస్తూ అడిగింది. అవి సమ్మోహనంగా ఉన్నాయి.

''నేనన్న మాటలకి మీరు ఇరకాటంలో పడ్డ సంగతి తెలుస్తూనే ఉంది. అయినా హుందాగా నిజం ఒప్పుకొని చిరునవ్వుతో సంభాషణ కొనసాగిస్తున్నారు. ఇంటర్వ్యూలలో అధికారులకి ఈపాటి సభ్యతా లేదు. సంస్కృతీ లేదు. అభ్యర్థికేం తెలుసునో తెలుసుకో ప్రయత్నించకుండా, తమకేం తెలుసునో వాటిని గురించి ప్రశ్నలడుగుతారు. ఆ ప్రశ్నలకి సరైన సమాధానం చెబితే వారికి రుచించదు. అభ్యర్థి సమాధానం చెప్పలేకపోయినప్పుడు వారు విజయగర్వంతో పొంగిపోతూ సమాధానం తెలియజేసి, 'ఈమాత్రం తెలియదా?' అన్నట్టుగా చూస్తారు. సరైన సమాధానం చెప్పడంకాని, సమాధానం తెలియదని నిర్భీతిగా చెప్పడంకాని దుందుడుకు స్వభావమనుకొంటే ఏం చేసేది?''

''మీ ప్రశంసలకి కృతజ్ఞతలు. మీరన్న దాంట్లో వాస్తవం లేకపోలేదు. చివరగా మీరు విసిరిన వ్యంగ్యాన్ని స్వీకరించక తప్పదు. అయినా నేనొకటి అడిగితే మీరేదో చెప్పారు. నేనడిగింది..'' ఆమె ఆగింది.

''వారడిగిన కొన్ని ప్రశ్నలూ, వాటికి నేనిచ్చిన సమాధానాలూ- అంతేగా? యిటీవలే ఓ ఉద్యోగంకోసం వెళ్ళినప్పుడు ఓ సభ్యుడు సృష్టిరహస్యం గురించి చెప్పమన్నాడు. విశ్వమయమైన ఓంకార నాదం నుంచి ఆదిశక్తి ఉద్భవించిందనీ ఆమె బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను ఒకరొకరుగా సృష్టించి పొందు కోరిందనీ, శివుడు లౌక్యంగా ఆదిశక్తిని భస్మీపటలం కావించి, అంతకుముందు ఆదిశక్తి కోరికను నిరాకరించి ఆమె కోపాగ్నికి భస్మమైన బ్రహ్మవిష్ణువులకు పునర్జీవం ప్రసాదించాడనీ, ముందుగా ముగ్గురికీ దేవేరులనూ సృష్టించి అటుపై బ్రహ్మ సమస్తలోకాల్నీ, చరాచర జీవరాశుల్నీ సృష్టించాడనీ- చిన్నతనంలో విన్న ఆదిభట్ల నారాయణదాసుగారి హరికథ చెప్పాను. గురుత్వాకర్షణ శక్తివలన దగ్గరపడ్డ విశ్వపదార్థం, విపరీతమైన సాంద్రత కారణంగా కలిగిన ఒత్తిడికి లోనై అపరిమితమైన ఉష్ణం జనియించి మహా విస్ఫోటనం చెంది, (బిగ్‌బాంగ్) నక్షత్ర మండలాలూ, గ్రహ సహితమైన సౌరకుటుంబాలూ విస్తరించాయన్న బెల్జియన్ భౌతిక శాస్త్రవేత్త జార్జి లెమాయిర్ సిద్ధాంతాన్ని గురించి చెప్పాను. ఇటీవలే ప్రతిపాదింపబడుతున్న అనంత దైర్ఘ్యమూ, పరిమిత మందమూ కలిగి సమాంతరంగా పోయే రెండు విశ్వాల 'ఎమ్' సిద్ధాంతాన్ని గూర్చి చెప్పాను. డార్విన్ పరిణామ వాదాన్ని గురించి చెప్పాను. అంతా చెప్పనిచ్చి తానాశించిన సమాధానం అది కాదనీ, కుటుంబ నియంత్రణ వ్యవస్థలో ఉద్యోగం



కోసం వచ్చి ఆమాత్రం తెలియకపోతే ఎలా అనీ విజయహాసం చేస్తే వళ్ళు మండదూ?' మీరడిగిన ప్రశ్నకిదే సమాధానం అన్నాను. 'కాదు స్త్రీ, పురుష జాతుల సంయోగమ'న్నాడు. 'మీరాశించిన సమాధాన మదైతే అడిగిన ప్రశ్నలో స్పష్టత లేద'న్నాను. వికటాట్టహాసం చేసి 'పోయి సినిమాలు చూడు. బొడ్డూడని వాళ్ళక్కూడా సృష్టిరహస్యం తెలుస్తుంద'ని ఎద్దేవా చేసి, స్వస్తి పలికేశారు! శివానందం అప్పుడు, అక్కడ చెప్పిన మాటల్ని యిక్కడ, యిప్పుడు చెప్పాడు'' అంతే స్పష్టంగా చెప్పాడు.

''అంటే ఆయన జీవశాస్త్రపరంగా అడిగాననుకొన్న ప్రశ్నకి మీరు హిందూ పురాణాల ఆధారంగానూ, భౌతిక శాస్త్ర పరంగానూ సమాధానమిచ్చారన్నమాట! ఆ ప్రశ్న వెనుకనున్న అంతరార్థమేమిటో ఆయన్ని ముందే వివరణ అడగాల్సింది పోయి, చివరో స్పష్టత లేదని నిందవేస్తే ఎలా మరి? అవునూ, యింతకీ జీవశాస్త్రపరంగా ఆ ప్రశ్నకి సమాధానం చెప్పమని ముందుగానే నిర్దేశిస్తే సమాధానం ఏం చెప్పేవారు?'' హావభావాలు మిళితం చేస్తూ ఆమె కొంటెగా ప్రశ్నించింది. జారిన పైటని ఆమె గమనించలేదనిపించింది శివానందానికి. ఆమెలో కామదేవత రూపులు గోచరించసాగాయి.

''పరగా సంపర్కం వృక్షజాతికీ స్త్రీ, పురుష జాతుల సంయోగం సమస్త జీవరాశులకీ పునరోత్పత్తి కార్యక్రమంలో ప్రధానాంశాలని చెప్పడం కంటే వేరు సమాధానం ఏముంటుంది? అంతకు మించి సంభోగ క్రియనెలా చేస్తారూ అని ప్రశ్నించడం దారుణంగా ఉంటుంది. అవునూ- పమిట జారిందో, జార్చారో నాకు తెలియదుకాని చాలా యిబ్బందిగా ఉంది'' శివానందం మాట నాన్చలేదు.

శివానందం అలా అన్నా ఆమె పమిటని సర్దే ప్రయత్నం చెయ్యలేదు. ''అంగీ లేకుండా పంచె పైన నడుం దగ్గర కండువా బిగించిన మిమ్మల్ని చూసి నేనే రకమైన యిబ్బందికీ గురి కాలేదే?'' అందామె కళ్ళింతగా చేస్తూ.

''అలా నన్నెప్పుడు...?'' శివానందం ప్రశ్న పూర్తి చెయ్యలేదు.

''గత రెండు నెలలుగా ప్రతి సోమవారం సాయంత్రం శివాలయానికి వచ్చినప్పుడల్లా మిమ్మల్నా విధంగానే చూస్తున్నాను. అవునూ, భౌతికశాస్త్రంలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ అయ్యీండీ, శివాలయంలో అర్చకత్వం ఎందుకు చేస్తున్నట్టు?''

''వంశానుగతంగా వచ్చే అర్చకత్వాన్ని అభ్యసిస్తున్నాను. ఉద్యోగం దొరక్కపోతే ఇక ముందు జీవనాధారం అదే అవుతుంది మరి. ఇంటర్వ్యూలలో విజయ సాధన కోసం మార్గాలు తెలుస్తాయని నా స్నేహితులు బలవంతంగా నన్ను మీ సంస్థకు పంపారు. నా తరపున ఫీజు కూడా చెల్లించేశారని కింద తెలిసింది. మీరు మెలుకువలు నేర్పితే రాబోయే యింటర్వ్యూలలో విజయసాధన కోసం ప్రయత్నిస్తాను'' అన్నాడు శివానందం.

ఆమె పమిటని సరిచేసుకొంటూ కొంతసేపు మౌనంగా ఉండిపోయింది. ఆ తర్వాత మాటలు కూడదీసుకొని అంది. ''ఉద్యోగం దొరక్కపోతే ఉదరనిమిత్తం వంశపారంపర్యంగా వచ్చే ఓ ఆధారమున్న మీరు అదృష్టవంతులే అనుకోవాలి. ఇటు చదివినందుకు ఉద్యోగమూ రాకా, అటు విదిలించుకొన్న కులవృత్తులను తిరిగి చేబట్టలేకా ఎంతో మంది నిరాశకు గురౌతున్న కాలంలో మీ నిర్ణయం ప్రశంసించదగ్గదే''

''జ్ఞానపరంగా అందరికీ చదువన్నది ఎంతో సముచితమైనా, చదివినవారందరికీ ఉద్యోగాలు రాకపోవడంలోనే ఉంది ఉన్న చిక్కంతా. కులంతోనూ, చదువుతోనూ నిమిత్తం లేకుండా విద్యార్థికులు కూడా స్వయం ఉపాధి పథకాల వైపు మొగ్గు చూపవలసిన సమయమూ, అవసరమూ వచ్చాయి. ప్రజల ఆనవాయితీలనీ, అవసరాలనీ, ఆడంబరాలనీ ఆలంబనగా తీసుకొని అనేక గౌరవనీయమైన స్వయం ఉపాధి పథకాలు రూపొందాయి. దౌర్భాగ్యంకొద్దీ దగాలూ, మోసాలూ, దొంగతనాలూ, నకిలీ తీవ్రవాదుల పేర బెదిరింపులూ, గూండాల హస్తాలూ, సెటిల్‌మెంట్ వ్యవహారాలూ ఈ స్వయం ఉపాధి పథకాల జాబితాలో చేరిపోయాయి!'' శివానందం ఆవేశంగా అన్నాడు.

''మీరన్నట్టుగానే చదివిన చదువులకుద్యోగాలు రాక, కుటుంబం భారం మీద పడ్డ ఆడదేం చెయ్యాలో చెప్పండి'' ఆమె నెమ్మదిగా అడిగింది. ఓ రకమైన ఆవేదన లీలగా స్ఫురించింది.

''వస్త్ర రూప కల్పనలూ, హస్త కళాశిక్షణలూ, గృహాంతరాలంకరణ సలహాలూ, అలంకరణ వృత్తులూ, పాకశిక్షణలూ, తయారీలు యిలా ఎన్నో...''

''మీరు చెప్పినవన్నీ స్త్రీని అబలగా ఊహించి చెప్పినవే కాని, చదువుకి తగ్గవి కావు. సామర్థ్యానికీ, అభిరుచులకీ తగ్గవి కావు. ఇవన్నీ ఏవో అదనపు సంపాదనకు ఉపయోగపడ్తాయేమోకానీ కడుపు నిండడానికి పనికిరావు. ఇవన్నీ చాలామంది పెద్ద పెద్ద ఆఫీసర్ల భార్యలు ఉబుసుపోక చేపట్టే పథకాలు. సహకార సంఘాల పేరిట ప్రభుత్వం స్త్రీలకెన్నో వెసులుబాట్లు కల్పిస్తున్నా దళారులు చేసే దగాలతో, దోషపూరితమైన పంపిణీ వ్యవస్థలతో ప్రయోజనం దెబ్బతింటోంది''

''క్షమించండి. మీరన్న మాటల్లో వాస్తవం లేకపోలేదు. అయినా ఒక సంగతి. అర్హత పరీక్షలకీ, ప్రవేశపరీక్షలకీ ఎన్నో అంచెల్లో ఎన్నో శిక్షణా సంస్థలున్నా, అంతర్వీక్షణాలలో సమాధానాలు చెప్పే విధానంపై శిక్షణ నివ్వడమనేది మీ చదువుకు తగ్గ ఉపాధి పథకమే కదా? నిరుద్యోగం ప్రబలిన కొద్దీ మీ సంస్థ ఆదాయానికేమీ కొదవుండదు'' అన్నాడు శివానందం నవ్వుతూ.

ఆమె కుర్చీలోంచి లేచి, శివానందాన్ని కూడా రమ్మని సంజ్ఞ చేసి లోపలి గదిలోకి దారి తీసింది. శివానందం లేచి ఆమెననుసరించాడు. లోపల మరో నాల్గైదు చిన్నా పెద్ద సోఫాలున్నాయి. వాటి మీద అర్ధనగ్నంగా అయిదుగురు యువతులు వివిధ భంగిమల్లో కూర్చుని ఉన్నారు. చుట్టూ గోడల మీద కామసూత్రాల్ని విశదీకరించే వర్ణ చిత్రాలున్నాయి. శివానందం తెల్లబోతూ చూడసాగాడు. ఏదో కొద్దికొద్దిగా అవగాహన కాసాగింది.

''మీరెన్నో చెప్పారు కానీ పడుపువృత్తిని గురించి ప్రస్తావించలేదు. స్త్రీకి సమాజం చూపించిన అద్భుతమైన ఉపాధి పథకం. తొలిరాత్రుల గురించి అవివాహితులైన యువతీ, యువకులెన్నో మధురమైన స్వప్నాలు కంటారు. అవగాహన లేని కారణంగా బిడియపడే స్త్రీలకీ తొందరపడే పురుషులకీ తొలి రాత్రులు చేదు అనుభవాల్ని మిగులుస్తాయి. నిశ్శబ్దంగా అసంతృప్తీ, అశాంతీ నెలకొనే జీవితాలెన్నో. ఛిద్రమైన కాపురాలెన్నో. అంతర్వీక్షణ శిక్షణా కేంద్రమన్న ముసుగులో, కుటుంబ భారాన్ని మోసి కన్నవారికి ఆసరాగా ఉండే ప్రయత్నంలో, సంపాదించిన విద్యార్హతలు పనికిరాని కారణంగా, వంశపారంపర్యంకాని ఈ పడుపువృత్తిని ఆత్మవంచనతో ఓ ఉపాధి పథకంగానే నమ్మి చేబట్టాం. ఈ తొలిరాత్రి 'రక్షిత' సుశిక్షణా కేంద్రాన్ని ప్రారంభించాం!'' ఆమె గొంతులో ఓ ఆవేదన. ఓ నిర్లిప్తత. ఓ రాజీ పడ్డ మనసు.

శివానందానికి నోట మాట రాలేదు. తనను ఆ యింటర్వ్యూలో ఓ అధికారి అడిగిన ప్రశ్న గురించి స్నేహితులతో చెప్పాడు. తన్నాట పట్టించడానికి 'రాజా'గాడు చేసిన తమాషా యిది. ఆ మాటే ఆమెతో అన్నాడు. ''క్షమించండి, నా స్నేహితులు నన్నాట పట్టించడానికిక్కడికి పంపించారని యిప్పుడర్థమైంది'' సభ్య సమాజంలో ఆకలి ముందు నైతిక విలువల స్థానమేమిటో కూడా శివానందానికర్థమైంది.

''ఏదో ఆలోచనలో పడ్డట్టున్నారు? మీ స్నేహితులు చెల్లించిన సొమ్ముని అప్పనంగా తీసుకోవడం బావుండదు!'' ఆమె మాటల్లో నిజాయితీ గోచరించింది.

''నా స్నేహితులకి చేతి చమురు వదిల్తే వదిలింది కానీ, మీతో పరిచయం ఓ జీవిత సత్యాన్ని తెలిపింది. ఈ పరిచయం తీపి అనుభవమో, చేదు అనుభవమో తెలియదుకాని, జీవితంలో చీకటి కోణాన్ని చూసిన మరువలేని అనుభవం. అందుకు నా స్నేహితులకూ, మీకూ కృతజ్ఞతలు!'' శివానందం రెండడుగులు వేసి ఆగి కాస్త సందేహిస్తూ అడిగాడు. ''అవునూ, యింతకీ మీరిటువంటి ఉద్యోగం చేస్తున్న సంగతి మీవాళ్లకు..?''

''తెలిస్తే? అంటారు, అవునా? ఆ భయం లేదు. మీకు కార్డునిచ్చి పైకి పంపించింది, కన్యాదానం చేయాల్సిన మా కన్నతండ్రే!'' ఆమె ముఖంలోని నవ్వు చెదరలేదు.

శివానందం మస్తిష్కంలో గాఢాంధకారం వ్యాపించింది. ఇప్పుడు సమాజంలో చీకటికోణం అంటూ ఏమీ లేదు, అంతా చీకటే. మబ్బు తొలిగితే సూర్యుడి ప్రకాశం మరింతగా ఉంటుంది. మేఘం వర్షిస్తే గాలి శుభ్రపడ్తుంది. సమాజంలోని అంధకారాన్ని పారద్రోలాలంటే ఈ సూర్యుడు పనికిరాడు. కల్మషాన్ని నిర్మూలించాలంటే ఈ మేఘమూ, వర్షమూ, గాలీ- ఏవీ పనికిరావు. ప్రకృతిలో భాగం కాకుండా ప్రత్యేకంగా రూపుదిద్దుకొన్న సమాజంలోని చీకటిని పారద్రోలడానికి సమాజంలోంచే వెలుగు కిరణాలు ఉద్భవించాలి. తానే ఓ ప్రారంభ వెలుగు కిరణం ఎందుకు కాకూడదు? శివానందం ఆమెవైపు చూస్తూ అలానే నిలబడిపోయాడు.

☆